'ఆటా' కథల పోటీల్లో ఎంపికైన కథ

- వి.రాజారామమోహనరావు

# సర్దుబాటు



ఎన్నో ఊళ్ళని, ఎందరో మనుషుల్ని తన కూడా పెట్టుకుని వచ్చినట్టే సుబ్బారావు వస్తే ఎప్పుడు వచ్చినా, ఎంతసేపు వున్నా, వాడి రాక ఎంతో సంతోషం. నాకే కాదు, నా భార్యక్కూడా వాడు వస్తున్నాడంటే ఉత్సాహమే.

గుమ్మంలోంచే హడావిడి మొదలెడతాడు. 'ఇది వేటపాలెం జీడిపప్పు. చెల్లాయి, ఇవి తాపేశ్వరం కాజాలు... లక్కీగా దొరికాయిలే...' అంటూ పొట్లాలు ఆవిడ ముందు పెడతాడు.

"ఆయన తెచ్చే వస్తువులు కాదండి... వాటితోపాటు ఆయన మనసారా పిలిచే చెల్లాయి అన్న పిలుపు... సొంత అన్నదమ్ములు కూడా అంత కలివిడిగా ఉండని ఈ రోజుల్లో, ఎవరికీ తీరిక లేని ఈ కాలంలో పనిగట్టుకుని మనతో గడపటానికి ఆయన రావటమే పదివేలు..." అని ఎన్నోసార్లు ఎన్నో రకాలుగా అంటూనే వుంటుంది నా భార్య.

అతి సామాన్యంగా జరిగే పనుల్లో దాగివున్న విలువని గ్రహించగలిగే తత్వం రోజురోజుకీ అడుగంటిపోతోంది. ఒక ఊళ్ళో వాళ్ళకే ఒకరి గురించి మరొకరికి అఖ్ఖర్లేదు. పక్కపక్క ఇళ్ళవాళ్లే అపరిచితులుగా మెలుగుతున్న కాలం. అలాంటిది ఒక ఊరునుంచి మరో ఊరు ఓ స్నేహితుణ్ణి చూట్టానికి పనిగట్టుకుని రావటం అపురూపమే.

ఒక్కసారి కాదు ఈ సంవత్సరంలో ఇది మూడోసారి సుబ్బారావు రావటం. తెల్లారేటప్పటికి వాడు నాతో ఉంటూ ఉంటే మనసుకి హాయిగా వుంది.

సుబ్బారావుని 'సుబ్బూ'అనే పిలిచే వాళ్ళం. చాలాసార్లు 'సుబ్బిగాడు' అనీ అనేవాళ్ళం. ఆ రోజుల్లో మాతో ఎన్ని గంటలు గడిపినా, ఓపిగ్గా అందరి మాటలు వినటమే తప్ప, సాధారణంగా నోరు విప్పేవాడు కాదు. 'అస్సలు మాట్లాడవేమిటిరా?' అన్నా, నవ్వేవాడు తప్ప పెద్దగా మాట్లాడేవాడు కాదు. ఏమాత్రం వీలుదొరికినా వచ్చి స్నేహితులతోటే ఉండేవాడు తప్ప ఇంట్లో ఒంటరిగా ఉండేవాడు కాదు.

అలాంటి సుబ్బూని, ఇప్పుడు అరవై అయిదేళ్ళు వచ్చిన వయసులో గలగలా మాట్లాట్టం చూస్తుంటే ఆశ్చర్యంగా వుంటుంది. మనుషుల తత్వంలో సాధారణంగా పెద్ద మార్పులు వుండవంటారు. కానీ సుబ్బూ విషయంలో మాత్రం యిది చిత్రమైన మార్పే.

'ఒంటరిగా వచ్చాం, ఒంటరిగానే ఈలోకం నుంచి వెళ్ళిపోతాం... అంటూంటారు. ఎంతమంది ఆత్మీయులున్నా నిస్సంకోచంగా మనసు విప్పి చెప్పుకోలేని ఒంటరి భావనలు అందరికీ వుంటాయి. అయినా ఒంటరిగా బతకలేం కదా! అలా బతకటం సరైన జీవితం అని నాకు అనిపించటంలేదురా...' అన్నాడు సుబ్బూ కిందటి సంవత్సరం నా దగ్గరికి వచ్చినప్పుడు.

గంభీరంగా, లోతుగా మాట్లాట్టం వాడి తీరు కాదు. వాడి మనసుకి ఇబ్బంది కలిగించినదేదో వుంది. వాడంతగా వాడు చెప్పేవరకు అడగక పోవటమే మంచిదని వూరుకున్నాను. ఆ ఒక్కసారే కాదు, చాలాసార్లు అలాగే మాట్లాడుతున్నాడు.

మేం దగ్గరగా కలిసి గడిపిన మిత్ర బృందంలోని మరో ఇద్దరి ముగ్గురి దగ్గరకి కూడా సుబ్బారావు వెళ్ళి వస్తూనే వున్నాడు. వాడి ద్వారానే వాళ్ళ క్షేమ సమాచారాలు తెలుస్తున్నాయి. అదీ కిందటి సంవత్సరంనుంచే కలిసి చదువుకున్న రోజుల తర్వాత స్నేహితుల గురించి అప్పుడప్పుడు ఒకటీ రెండూ కబుర్లు తెలిసినా, సుబ్బారావు వాళ్ళ దగ్గరకి రాకపోకలు మొదలెట్టాకే తరచూ విశేషాలు తెలుస్తున్నాయి.

ఎంత వయసు వచ్చినా కొన్ని సరదాలు వుంటూనే వుంటాయి. సుబ్బారావు వచ్చినప్పుడల్లా, నేను వాడు కలిసి సినిమాలు చూస్తుంటాం. ఊళ్ళో ఉన్న వాటిల్లో ఏది మెరుగనిపిస్తే దానికి వెడతాం. ఇప్పటి సినిమాల నేపథ్యంలో అప్పటి గొప్ప సినిమాలని గుర్తుతెచ్చుకుంటాం. ఒంటరిగా నేను గానీ, వాడు గానీ చొరవ చెయ్యని చిన్న చిన్న చిరుతిళ్ళు కలిసి తింటాం. శరీరానికి వయసు తగ్గకపోయినా, ఆ క్షణాల్లో మనసుకి పసితనం వచ్చినట్టే వుంటుంది. ఆ తిరుగుళ్ళూ, చిరు తిళ్ళ మధ్యలోనే వాళ్ళ వీళ్ళ కబుర్లు చెపుతాడు సుబ్బారావు.

'రాజమండ్రిలో మన వెంకట్‌గాడు ఎంతైనా కొంత ఇబ్బందిగానే వున్నాడురా... ఆర్థికమైన కష్టాలు లేవనుకో. అయినా వాడికి మానసికంగా ఏదో లోటు...'

కాకినాడలో శాస్త్రిగాడిది మరో రకం సమస్య. చేతిలో పైసా ఉండదు వాడి దగ్గర. వచ్చే ఆదాయమే కొంచెం. దానికితోడు నెత్తిమీద బాధ్యతలు... భార్య అనారోగ్యం... ఏమాత్రం పట్టించుకోని కొడుకు, కోడలు...

బెజవాడలో వెంకటలక్ష్మి మాత్రం హాయిగా వుంది. మన వాళ్ళందర్నీ చూడాలంటుంది. నాతో ఓ నాలుగు రోజులు రా... అందర్నీ చూడచ్చు అంటే వినదు. పైగా సిల్లీగా ఓ మాట అంది. 'భర్త లేని నేను, భార్య లేని నువ్వూ కలిసి తిరిగితే పిల్లలేమనుకుంటారు...' అని....

పిల్లలేమనుకోవటమేమిటిరా? అయినా ఈ వయసులో... 'పోనీ ఎవరో ఒకళ్ళని కూడా తీసుకురా...' అందామనుకున్నాను. ఎందుకో అనలేకపోయాను.

కలిసి చదువుకునో, దగ్గరగా మెసిలో ఆత్మీయంగా బతికిన

**అతి సామాన్యంగా జరిగే పనుల్లో దాగివున్న విలువని గ్రహించగలిగే తత్వం రోజు రోజుకీ అడుగంటిపోతోంది. ఒక ఊళ్ళో వాళ్ళకే ఒకరి గురించి మరొకరికి అఖ్ఖర్లేదు. పక్కపక్క ఇళ్ళవాళ్లే అపరిచితులుగా మెలుగుతున్న కాలం.**

మనం మొత్తంమీద పది మంది ఉంటామేమో. అందరం తలోచోటా వున్నాం... 'తలో రకం జీవితానికి బందీలుగా వున్నాం. ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియని బతుకు. ఇంకా మనకిష్టమైన చిన్న చిన్న, సజావైన పనులు చెయ్యలేని ఇబ్బందులేమిటిరా?...' అన్నాడు సుబ్బారావు.

అది వాడు వేస్తున్న ప్రశ్నకాదని నాకు తెలుస్తూనే వుంది. ఇరుగ్గా, ఉక్కిరి బిక్కిరిగా వున్న వో పరిస్థితిని నాతో పంచుకోవటం అదృష్టమో, మరి మరింత దురదృష్టమో వృద్ధుల జీవన పరిమాణం పెరుగుతున్న రోజులివి. జీవితం జీవించటానికే... ఏ వయసులోనైనా, అది బాధపడటానికి, ఇతరులని బాధించటానికీ మాత్రం కాదు.

ఇక్కడ నేనూ, మా ఆవిడా బాగానే వున్నాం. పెన్షన్, ఇతర ఆదాయం మాకు ఇబ్బంది లేకుండా బాగానే గడుస్తోంది. పిల్లలు ఎవరూ దగ్గర లేదన్నదే మాకు లోటు.

సుబ్బారావుకి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు.

భార్య వున్నంతవరకూ పెద్దకొడుకు దగ్గరే వుంటూ వచ్చారు. భార్య పోయాక నలుగురు పిల్లల దగ్గరనే మారుతూ గడుపుతున్నాడు. భార్యపోయిన ఒక యేడాదిపాటు రకరకాల ఇబ్బందులు పడ్డాడు.

'ఆడది మగవాడి మీద ఆధారపడి బతుకుతుందంటారు. అంతకన్నా ఎక్కువగానే మగవాడు ఆడదాని మీద ఆధారపడతాడు. ఎడబాటు, వైధవ్యం తట్టుకోవటం ఆడవాళ్ళకన్నా మగవాళ్ళకే కష్టం అన్నది నా వరకూ అనుభవమే కాదు, గట్టి నమ్మకం... ఎన్నో రకాలుగా మనసుని సమాధానపరుచుకుని, శరీరాన్ని కష్టపెడితేనే కానీ, నేను నిలదొక్కుకోలేకపోయాను. ఇప్పటికీ తను లేని లోటు, లోటే...' భార్యపోయిన తర్వాత సుబ్బారావు నాతో అన్న ఆ మాటల్లో, ఎంతో సత్యం వుంది.

వాడి మనస్థితి, వాడు తట్టుకోలేని ఒంటరితనం వాడి పిల్లలకి అర్థం కాలేదేమోనని నా అనుమానం. చిన్నతనం వల్ల కావచ్చు. అసలు తండ్రి పరిస్థితిని గ్రహించలేని అశక్తత కావచ్చు ఏమైనా సుబ్బారావు తనంతట తానే నిలబడగలిగాడు. పైకి ఓ ఇబ్బందీ వున్నట్టుగా కనపడకుండా, తనని తను నడుపుకుంటూ వస్తున్నాడు.

* * *

వస్తూనే గుమ్మంలోంచే... "ఏరా అప్పుడే నిద్ర లేచావా?" అన్నాడు సుబ్బారావు.

"నువ్వు వస్తున్నావని తెలిశాక అసలు నిద్ర పడుతుందేమిటి?" అన్నాను.

ఇంత నవ్వు ముఖంతో తిన్నగా వంటింట్లోకి వాళ్ళ చెల్లెలు దగ్గరికి వెళ్ళిపోయాడు.

వాళ్ళ కబుర్ల తర్వాత, కాలకృత్యాలు, టిఫిన్లు, కాఫీలు అయ్యాక, మేమిద్దరం బజారువేపు బైల్దేరాం.

"ఓ చెడు వార్త చెప్పాలిరా..." అన్నాడు సుబ్బారావు కొంత దూరం వెళ్ళాక. ఏమిటన్నట్టు ఆదుర్దాగా వాడి వేపు చూశాను.

"శాస్త్రిగాడి భార్య... అదే కాకినాడ... పోయిందిరా..." అన్నాడు.

"ఎప్పుడు...?"

"నెల దాటింది... వాడు రిటైర్ అయిన తర్వాత సుఖమే కరువైపోయింది ఆ మహా ఇల్లాలికి. ఇంటి వ్యక్తులే లోకువ చేశారు. కడుపున పుట్టిన వాళ్ళే పనిమనిషిలా చూశారు. ఆర్థికమైన ఇబ్బంది... శాస్త్రిగాడు నోరు మెదపలేక పోయాడు" అన్నాడు సుబ్బారావు.

శాస్త్రి పెళ్ళిలో చూడటమే ఆవిణ్ణి. ఆ తర్వాత చూడనే లేదు. చెయ్యగలిగిందేమీ లేకపోయినా మనసు బరువుగా వుంది. అసలే అంతంత మాత్రంగావున్న శాస్త్రి పరిస్థితి ఇప్పుడెలాగో? అనిపించింది.

"అందరం కలిసి ఒకసారి శాస్త్రిగాడి దగ్గరకి వెళ్ళొద్దాంరా. వెంకట లక్ష్మి కూడా వస్తానంది. లక్ష్మి పిల్లలతో నేనే మాట్లాడి వొప్పించాను. నేను వెళ్ళి వెంకట లక్ష్మిని తీసుకొస్తాను. అదే ట్రైనుకి నువ్వూ, చెల్లాయి మాతో కలిస్తే రాజమండ్రిలో వెంకట్‌గాడు, మిగిలిన వాళ్ళు కలుస్తారు... సరేనా..."అన్నాడు.

వెంటనే 'సరే' అన్నాను.



'ఆడది మగవాడి మీద ఆధారపడి బతుకుతుందంటారు. అంతకన్నా ఎక్కువగానే మగవాడు ఆడదాని మీద ఆధారపడతాడు. ఎడబాటు, వైధవ్యం తట్టుకోవటం ఆడవాళ్ళకన్నా మగవాళ్ళకే కష్టం అన్నది నా వరకూ అనుభవమే కాదు, గట్టి నమ్మకం...

'మొన్న వో పెద్దాయన, వో విషయం గమ్మత్తుగా చెప్పాడురా... ముసలాళ్ళు కొందరు రోజూ ఓ గుడిసెంటర్లో కలుసుకుంటారుట. ఓ రోజు వాళ్ళల్లో ఒకాయన వేరే ఊళ్ళోవున్న మిత్రుడికి ఉత్తరం రాశాడుట. 'రోజూ గుడిదగ్గర కనిపించే సత్యన్నారాయణ మూడు రోజులుగా కనిపించటం మానేశాడురా...' అని.

సుబ్బారావు నవ్వుతూనే చెప్పినా. ఆ మాటల్లో అసహాయత, బాధ మన అదుపులో లేకుండా జరిగే విషయాల నిర్వేదం నవ్వు ముల్లులా పొడిచాయి.

"ఒరే సుబ్బా... ఇన్నాళ్ళుగా నా మనసులో వున్నా, నిన్ను అడగకూడదు. నీ అంతగా నువ్వు చెపితేనే వినాలని అనుకున్నాను. అసలు నీలో వున్న బాధేమిటిరా?" అన్నాను.

"మనసు... బాధ... ఆ గోలంతా ఎందుకులే... ఏదో ఉన్నంతలో రోజులు గడిపేస్తే పోతుంది కదరా..." అన్నాడు.

వాడి ముఖంలోకి చూశాను. బాధ వుందో లేదో దాస్తున్నాడో ఏం అర్థం కాలేదు.

"మరీ చెప్పటం కష్టం అయితే చెప్పకులే..." అన్నాను. నిజంగా వాణ్ణి బాధ పెట్టాలని లేదు నాకు.

"కష్టమని... బాధని కాదురా... అసలు ఒక విషయమనే కాదు... ఓ వ్యక్తనే కాదు... చాలా విషయాలు, చాలా పద్ధతులు చూసి... జీవితం చివరికి ఇంతేనా? అన్న ఓ చిత్రమైన బాధ...

రిటైర్ అయ్యాక కూడా అయిదేళ్ళపాటు, విశ్రాంతి సౌఖ్యం అన్నది ఆలోచించకుండా, గతంలో ఎలాగో, అలాగే కష్టపడి రకరకాల చాకిరీలు చేసి సంపాదించాను. కుటుంబంలో అందరి సుఖమే నా సుఖం అని పూర్తిగా నా నమ్మకం. పిల్లలందరూ బావున్నారు. ఆర్థికంగా, సుఖంగా బతకటానికి ఎవరికీ ఏ లోటు లేదు.

మా ఆవిడ... నీకు తెలుసుగా... తను లేని జీవితం ఒక్కసారిగా నాకెంత శూన్యంగా మారిపోయిందో... ఆ తర్వాత నాకు సంపాదన తాపత్రయం పోయింది. నాకొచ్చే పెన్షన్ డిపాజిట్స్ ఆదాయం నాకు పుష్కలంగా సరిపోతుంది. జీవితంలో, ఏ రకంగా నిలదొక్కుకోవాలా అన్నది తోచని స్థితి. అన్నింటి పట్లా నిరాశగా వున్న ఆ స్థితిలో... మరి తెలిసే చేశారో, తెలియని అమాయకత్వమో నా పిల్లలు వెలిబుచ్చిన అభిప్రాయాలేమిటంటే, 'అన్నీ మాకు వదిలేసి విశ్రాంతి తీసుకోండి. ఏదేనా కావాలంటే మమ్మల్ని అడగండి. మేం చూస్తాం...'

వాళ్ళు తప్పుగా అన్నారని నాకనిపించలేదు. వాళ్ళకి నామీద ప్రేమ, గౌరవం లేవనీ కాదు.

మొత్తం జీవితాన్ని ఏ వ్యక్తైనా ఎవరికేనా అప్పగించేసి బతగ్గలరా అని... జీవితం అంతా బాధ్యతగా బరువు మోసిన వ్యక్తి కొంతకాలమేనా... చివరలోనేనా నిష్పూచీగా, జీవితాన్ని అనుభవించకూడదా అని.

ఇది ముసలితనపు వో రకం బాధేమో నాకు తెలియదు. కానీ నాకు వాళ్ళు చెప్పినట్టు అలా బతకాలనిపించలేదు. పిల్లలు నలుగుర్నీ కూచోపెట్టి నా ఉద్దేశాలు చెప్పాను. నలుగురూ అర్థంచేసుకున్నారు. 'మీ ఇష్టం నాన్నగారు...' అన్నారు.

ఎవరి దగ్గర ఉండాలంటే వాళ్ళ దగ్గరకి వెడుతున్నాను. మన వాళ్ళందర్నీ, స్నేహితుల్నీ కలుస్తున్నాను.

నేను ఆవేశపడినా, నా పిల్లలు తొందర పడినా, పరిస్థితి ఇలా ఉండేది కాదు... నా బాధంతా ఏమిటంటే ముసలితనంలో కూడా... అసలు ముసలితనంలోనే అందరికీ స్వతంత్రం కావాలి. మన స్నేహితుల్లోనే చాలా మంది అది లేక ఉక్కిరిబిక్కిరిగా వున్నారు... అంటూ వయసు మళ్ళిన చాలామంది గురించి చాలా కబుర్లు చెప్పాడు సుబ్బారావు.

అర్థం అయీ, అవక ఒక్కోసారి ఒక్కో సాయంత్రం దిగులుగా వుంటుంది. కారణాలు ఏమైనా ఆ దిగులులోంచి మనంతటమనమే బైట పడాలి. సుబ్బారావు అదే చేశాడు.

బాధలేని జీవితం ఎక్కడుంది? విబేధాలు లేని కుటుంబం ఎక్కడుంది?

కోపంతో ఓర్పు, తొందరపాటుతో శాంతం, మన వాళ్ళ పట్ల ఎప్పటికీ ప్రేమ... కష్టంలో కూడా ఆశ వుంటే, పెద్ద వయసుక్కూడా జీవితం వుంది.

అందరం అనుకున్నట్టుగానే కాకినాడ వెళ్ళాం. శాస్త్రిని పలకరించటానికే అయినా, మేం అందరం ఒకళ్ళనొకళ్ళు ఆప్యాయంగా గతంతో తడుముకున్నాం. అందరం కలిసింది ఒక్కరోజే అయినా కొత్త శక్తి, ఉత్సాహం చేరాయి మాలో...

శాస్త్రికి ఎంత మాత్రం అనుకూలంగా లేని ఆ పరిస్థితుల నుంచి, కాకినాడ నుంచి... "శాస్త్రిని నాతో తీసికెడుతున్నారా..."అంటూ సుబ్బారావు, మాతోపాటే శాస్త్రిని తీసుకొచ్చేశాడు. శాస్త్రి ఎంత కాలం సుబ్బారావుతో వుంటాడన్నది మాకు అంత ముఖ్యమైన విషయం అనిపించలేదు.

★